# అనంతం

**సంసారమంటే రెండు శరీరాలు కాదు, రెండు మనసులు కలిసి చేయాల్సిన ప్రయాణం. ఇందులో మాటా మాటా కలవాల్సింది పోయి, పెరిగితే ఆ సంసారం సదా నరకం. ఆ శబ్దఘోష అనంతం!**

"ఈ రోజు మనం సినిమాకు వెళుతున్నాం. నువ్వు త్వరగా తయారవ్వాలి."

"మీకు ఇంత అకస్మాత్తుగా సినిమాకెళ్ళాలన్న బుద్దెందుకు పుట్టిందో! ఏమిటి విశేషం?"

"విశేషం ఏమీ లేదు. సినిమాకెళ్ళాలనిపించింది. వెళుతున్నాం. అంతే. అందుకే ఈ రోజు ఆఫీసు నుండి త్వరగా బయటపడ్డాను. ఇప్పుడు టైమ్ అయిదుంబావవుతోంది. నీకు సరిగ్గా అరగంట టైముంది తయారవడానికి."

"వెళుతున్నాం కాదు, వెళుతున్నాను అనండి. సినిమాకు మీరు వెళ్ళండి. నాకిప్పుడు వీలు కాదు."

"వీలు కాకపోవడమేమిటి? తప్పకుండా వీలవుతుంది. ప్లీజ్... వెంటనే తయారవ్వాలి."

"ఎలా వీలవుతుందండి? సాయంత్రానికి వంట చెయ్యొద్దూ. మీ అన్న కొడుకులింకా కాలేజీ నుండి రానేలేదు. వాళ్ళొచ్చి ఏం తింటారు?"

"ఈ ఒక్క రోజుకు ఎలాగో సర్దుకుంటారులే. నువ్వు త్వరగా తెములు."

"ఎలా సర్దుకుంటారు? కాలేజీ నుండి ఆకలితో వచ్చిన వాళ్ళకింత అన్నం కూడా పెట్టకుండా మొగుడితో హాయిగా సినిమాకు చెక్కేసిందని రేపు ఎవర్నంటారు? నన్నేగా? నాకు ఏ సినిమాలూ వద్దు బాబూ! నన్నిలా బతకనివ్వండి, చాలు. కావాలంటే మీరు వెళ్ళిరండి. నన్ను తీసుకెళ్ళలేదని నేనేమీ అనుకోను."

"నేనొక్కణ్ణే సినిమాకు వెళ్ళనని నీకు తెలుసు. ఎప్పుడైనా అలా వెళ్ళానేమో చెప్పు. ఎప్పుడెళ్ళినా కలిసే వెళ్ళాం కదా!"

"ఆ రోజులు వేరు. ఈ రోజులు వేరు. ఇప్పుడు మీరొక్కరే వెళ్ళక తప్పదు. మీ పాత అలవాట్లను మార్చుకోండి."

"ఎందుకు మార్చుకోవాలి? ఇప్పుడేమయిందని నా పాత అలవాట్లను మార్చుకొమ్మంటున్నావు?"

"పోనీయ్. ఏమీ కాలేదు. దయచేసి నన్ను వదిలి పెట్టండి. నా కోసం చూడకండి. నాకవతల బోల్డు పనుంది. మీరు వెళ్ళిరండి. నన్ను తీసుకెళ్ళలేదనీ నేనేమీ అనుకోను."

"నువ్వేమో అనుకుంటావని కాదు. నీతో నాకిప్పుడు సినిమాకెళ్ళాలనిపించింది. నా కోసం. ఫర్ మై సేక్. ఫర్ మై ప్లెజర్. నువ్విప్పుడు నాతో సినిమాకు రావాలి. వస్తావా, రావా?"

"ఆజ్ఞాపిస్తున్నారా?"

"ఆజ్ఞాపించటం లేదు. అర్థిస్తున్నాను."

"అర్థించడం దేనికి? ఆజ్ఞాపించే హక్కు మీకుంది. అధికారం మీకుంది. మీరు రమ్మని ఆజ్ఞాపిస్తే వస్తాను."

"ఇదివరకొకసారి నువ్వు సినిమాకు వెళ్దామంటే నేను రాలేదనేకదా నువ్విప్పుడిలా మాట్లాడుతున్నావు. అప్పుడు నాకు వీలు కాలేదు. ఆ రోజు నిన్ను డిజపాయింట్ చేసినందుకు సారీ! సరేనా?"

"ఇప్పుడు మిమ్మల్ని సారీ చెప్పమని ఎవరన్నారు? అప్పుడెప్పుడో నేను మిమ్మల్ని సినిమాకు వెళ్దామని అడగటం, మీరు రాను అనడం నాకసలు గుర్తేలేదు. నేనా విషయం ఎప్పుడో మరిచిపోయాను. దానికి, దీనికి ఎలాంటి సంబంధమూ లేదు. మీకంటే నేను అన్నింటిలోనూ చిన్నదాన్ని. నాకు మీరు సారీ చెప్పడమేమిటి? నేనో గయ్యాళిదాన్నని రుజువు చెయ్యటం కోసమా!"

"ఓ గాడ్! నీతో కలసి సినిమాకు వెళ్దామని త్వరగా ఇంటికొచ్చినందుకు ఇంత రాద్ధాంతమా."

"నేనేం రాద్ధాంతం చేశాను? నాకు సినిమాకు రావడం కుదరదు అన్నాను. అది రాద్ధాంతం ఎలా అవుతుందో నాకైతే తెలియదు. చేతినిండా పని పెట్టుకొని నేనిప్పుడు సినిమాకెలా రానూ!"

"ఏమిటా పని. వంట చెయ్యడమేగా. సినిమా నుంచి వచ్చాక వంట చేసుకోవచ్చు. ఈ లోపల కొంపలేం అంటుకుపోవు."

"వాళ్ళొచ్చి ఏం తింటారు?"

"ఏమీ తినరు. ఒక పూట కొంచెం ఆలస్యంగా తింటే ప్రాణాలు పోవు. మనం వచ్చేంతవరకు వాళ్ళేదైనా హోమ్‌వర్క్ చేసుకుంటూ కూర్చుంటారు."

"మీరలాగే అంటారు. చిన్నపిల్లల కడుపులు మాడ్చి సినిమాలకూ, షికార్లకూ వెళ్ళిందని రేపు మీవాళ్ళంతా ఎవర్నంటారు?"

"మావాళ్ళంటే ఎవరు? మావాళ్ళు నీవాళ్ళు కారా?"

"మీవాళ్ళు నావాళ్ళెలా అవుతారు? వాళ్ళ దృష్టిలో నేనెప్పుడూ పరాయిదాన్నేగా?"

"వాళ్ళ దృష్టిని గురించి ఎందుకు పట్టించుకోవాలి? మన దృష్టి సరిగ్గా ఉంటే అన్నీ సరిగ్గానే ఉంటాయి."

"అంటే... అంటే... నా దృష్టే సరిగ్గా లేదంటారు. అంతేగా మీరనేది. వాళ్ళేమన్నా సరే పడాలి. ఈ ఇంట్లో ఓ దాసీదానిలా పడుండాలి. సినిమాకెళ్ళే అదృష్టం కూడానా నా ముఖానికి."

"నిన్ను దాసీదానిలాగా ఎవరు పడుండమన్నారు? నీ ఇంట్లో నువ్వు స్వతంత్రురాలివి. అంతా నువ్వూహించుకోవడంలోనే ఉంది. మన పనులు మనం చేసుకోవడం దాసిపనవుతుందా?

"అవును. అంతా నేను ఊహించుకోవడంలోనే ఉంది. మీవాళ్ళంతా మంచివాళ్ళే. నేనే చెడ్డదాన్ని."

"నిన్ను చెడ్డదానివని ఎవరన్నారు? అసలీ మావాళ్ళంటే ఎవరు? ఎవరు నిన్ను దాసీదానిలా చూస్తున్నారు? ఎవరు నిన్ను అనుక్షణం ఆడిపోసుకుంటూ ఇంత క్షోభకు గురి చేస్తున్నారు? ప్లీజ్ చెప్పు? వాళ్ళెవరో చెప్పు?"

"ఎవరూ లేరులెండి. అంతా నేను ఊహించుకోవటంలోనే ఉంది."

"ఇంతసేపూ 'మీవాళ్ళు', 'మీవాళ్ళు' అని ఇప్పుడేమో ఎవరూ లేరంటావేమిటి? మావాళ్ళంటే మా అమ్మా? మా అమ్మొచ్చి అత్తగా నీమీద ఎప్పుడు పెత్తనం చేసింది. ఆమె ఎప్పుడో రెండు నెలలకొకసారో, మూడు నెలలకోసారో మనింటికొచ్చిపోతుంటుంది. మనం కూడా మా ఊరికి ఆర్నెల్లకొకసారి కూడా వెళ్ళడం లేదు. అలాంటప్పుడు మా అమ్మగానీ, మా నాన్నగానీ నీమీదెప్పుడు పెత్తనం చేశారు? నీతో ఏం పనులు చేయించుకున్నారు? నిన్నెప్పుడు దాసీదానిలా చూశారు? ప్లీజ్ చెప్పు. వాళ్ళవల్ల నీకు కలిగిన బాధేమిటో చెప్పు."

"బాధేమీ లేదు."

"ఇంత బాధపడుతూ బాధేమీలేదంటావేమిటి? మా అమ్మ నిన్నెప్పుడైనా ఏమన్నా మాటలన్నదా? అవమానకరంగా ప్రవర్తించిందా? మా నాన్నేమైనా అన్నాడా?"

"ఎవరూ ఏమీ అన్లేదు. అంతా నేనే ఊహించుకుంటున్నాను."

"వాళ్ళు నిజంగా నిన్నేమన్నారో చెప్పు. నేను వాళ్ళను అలా ఎందుకన్నారని అడుగుతాను. మరోసారి అలా అనొద్దని వార్నింగ్ కూడా ఇస్తాను."

"మీరేమీ అడగొద్దు. మీరేమీ వార్నింగులివ్వద్దు. మామీద మొగుడికి చాడీలు చెప్పిందని, మమ్మల్ని తిట్టించిందని వాళ్ళు మళ్ళీ నన్ను ఆడిపోసుకోవాలనా మీ ఉద్దేశం?"

"అయితే, మరి నన్నేం చెయ్యమంటావు? వాళ్ళేమన్నారో చెప్పవు, వాళ్ళను అడుగుతానంటే అడగొద్దంటావు. సినిమాకు రమ్మంటే నా మొఖానికంత అదృష్టమా అంటావు. నీకు నా నుంచి ఏం కావాలో చెప్పు. నేనేం చేస్తే నువ్వు హాయిగా ఉంటావో చెప్పు. ఈ నసుగుడు మానేసి నీకు నిజంగా ఏం కావాలో చెప్పు."

"ఎందుకంత గొంతు పెంచి మాట్లాడుతున్నారు? పక్క పోర్షన్ వాళ్ళు వింటారు. అవును. మీ దృష్టిలో నాది నసుగుడే. మీరు నన్ను అర్థం చేసుకున్నదంతే! ఇంకాస్సేపయితే మీ కొడుకులొస్తారు. వాళ్ళొచ్చాక కూడా మీరిలాగే అరిచారంటే మా బాబాయి మా పిన్నిని బాగా తిడుతున్నాడని పొంగిపోతారు. ఇదేదో సుఖపడిపోతున్నదని మీవాళ్ళు నా నెత్తి మీద వాళ్ళిద్దర్నీ తెచ్చి పెట్టారు."

"అదీ సంగతి. నీ బాధకంతటికీ కారణమేమిటో నాకిప్పుడు తెలిసింది. వాళ్ళిద్దర్నీ చదివించటం కోసం ఇక్కడకు తీసుకురావడమేనన్నమాట నేను చేసిన పెద్ద తప్పు."

"మీరు తప్పు చేశారని నేనేమీ అనడం లేదు."

"వాళ్ళనిక్కడ చదివిస్తానని తీసుకొచ్చింది నేనేకదా! తప్పు చెయ్యకపోవడమేమిటి? పెద్ద తప్పే చేశాను. నీ మెడకు రెండు పెద్ద గుదిబండల్ని కట్టేశాను."

"ప్లీజ్... ఊరుకోండి. పెద్ద పెద్ద మాటలు మాట్లాడకండి. అలా మాట్లాడితే నేను సంతోషిస్తాననుకోకండి."

"నువ్వు సంతోషిస్తావని కాదు. ఉన్నమాట అంటున్నాను. వాళ్ళనిక్కడికి తీసుకొచ్చినప్పట్నించే నీ ప్రవర్తనలో మార్పొచ్చింది. అప్పట్నించే నువ్వు 'మీవాళ్ళు', 'మీవాళ్ళు' అనే నిష్ఠురాలు మొదలెట్టావు. వాళ్ళను తీసుకురావడం నాకిష్టం లేదని నువ్వు మొదలే చెప్పొచ్చుగా. చెబితే వాళ్ళను తీసుకొచ్చేవాడిని కాదుగా."

"ఔనౌను. నేను చెబితే తీసుకొచ్చేవాళ్ళే కాదు. ఎంత అమాయకంగా మాట్లాడుతున్నారు. ఎవరైనా వింటే నిజమేననుకుంటారు. నా కసలు చెప్పటానికి అవకాశం ఎప్పుడిచ్చారుగనుక? మీరు వాళ్ళను నన్నడిగే తీసుకొచ్చారా?"

"ఈ సంవత్సరం ఇంటర్ ఫస్టియర్ చదివించ

చిత్రాలు: నర్సిం



టానికి రఘునూ, రమేష్‌నూ ఇక్కడకు తీసుకొస్తున్నానని నీతో చెప్పలేదా? ప్రమాణం చేసి చెప్పు. నీతో చెప్ప కుండానే వాళ్ళనిక్కడకు తీసు కొచ్చానా?"

"చెప్పారు? ఎప్పుడు చెప్పారు? వాళ్ళనిక్కడకు తీసుకొస్తానని మీ వాళ్ళకు మాటిచ్చాక నాకు చెప్పారు. అప్పుడు నేనొద్దంటే మాత్రం మీ నిర్ణయం మారేదా? మీ అమ్మగారి మాటను మీరు జవదాటరుగా. ఆమె ముందు నేనెంతటిదాన్ని."

> "అయితే, మరి నన్నేం చెయ్యమంటావు? వాళ్ళేమన్నారో చెప్పవు, వాళ్ళను అడుగుతానంటే అడగొద్దంటావు. సినిమాకు రమ్మంటే నా మొఖానికంత అదృష్టమా అంటావు. నీకు నా నుంచి ఏం కావాలో చెప్పు."

ఇప్పుడిక్కడ మా అమ్మ ప్రసక్తెందుకొచ్చినట్టు? వాళ్ళను తీసుకెళ్ళమని మా అమ్మేం చెప్ప లేదు. వాళ్ళనిక్కడకు తీసుకొచ్చి చదివించడం నా బాధ్యతగా గుర్తించాను. మా ఊర్లో టెన్త్ వరకే ఉంది. ఆ తర్వాత వాళ్ళు చదువుకోవాలంటే వేరే ఏదన్నా టౌన్‌కు వెళ్ళక తప్పదు. వేరే ఎక్కడకో పంపించడం దేనికి. మన దగ్గరికే తీసుకొద్దామని నాకనిపించింది. వాళ్ళతో కనీసం గ్రాడ్యుయేషనయినా పూర్తిచేయిస్తే ఏదన్నా జాబ్ దొరుకుతుంది. వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిల్చోగలుగుతారనిపించింది."

"కనీసం గ్రాడ్యుయేషనైనా పూర్తి చేసే అర్హత ఒక్క మగవాళ్ళకే ఉందేమో?"

"అలా అని ఎవరన్నారు?"

"అయితే, మరి నన్నెందుకు చదివించరు? నేనూ పెద్దగా చదువుకోలేదు. గ్రాడ్యుయేట్‌నన్నా కావాలన్న కోరిక నాక్కూడా ఉంది."

"ఉండగానే సరిపోదుగా. అందుకు ఎంతో పట్టుదల కావాలి. కష్టపడాలి. టెన్త్ ఎగ్జామ్స్ ప్రైవేట్‌గా రాయొచ్చునని నీకెన్నోసార్లు చెప్పాను. కానీ, నువ్వేమన్నా ఇంట్రస్ట్ చూపించావా? నీకెప్పుడూ ఇంటిపనితోటే సరిపోతుందాయె."

"ఇంటిపనంతా నేను చెయ్యకపోతే ఎవరొచ్చి చేస్తారు? రోజూ ఉదయం తొమ్మిదింటిలోగా మీ ఇద్దరి కొడుకులకు భోజనాలు పెట్టి కాలేజీకి పంపించాలి. మధ్యాహ్నం తినడం కోసం వాళ్ళకు టిఫిన్ కూడా తయారు చేసి టిఫిన్ బాక్సులలో పెట్టివ్వాలి. పదింటిలోగా మిమ్మల్ని ఆఫీసుకు పంపించాలి. సాయంత్రం మీరింటికి రాగానే మీకు టిఫిన్ రెడీగా ఉండాలి. మళ్ళీ రాత్రికి భోజనాలు తయారు చెయ్యాలి. మీ బట్టలూ, వాళ్ళ బట్టలూ ఉతకాలి, ఇస్త్రీ చెయ్యాలి. అంట్లు తోమాలి, ఇల్లు శుభ్రం చేసుకోవాలి. ఏ వస్తువు ఎక్కడుండాలో అక్కడుంచుకోవాలి. దీంట్లో ఏ పొరపాటు జరిగినా మీకు కోపమొస్తుంది. ఈ పనులన్నీ నాకెవరు చేసిపెడతారు? నేను మీ కొడుకులకంటే మూడు నాలుగేళ్ళే పెద్దదాన్ని. నాదీ హాయిగా ఏ బరువు బాధ్యతలూ లేకుండా ఏ కాలేజీకో వెళ్ళి చదువుకోవలసిన వయసే. నాకు ఇరవయ్యేళ్ళు కూడా లేవు."

"అవును. నువ్వు కూడా ఏ కాలేజీకో వెళ్ళి చదువుకోవలసిన దానివే. ఒప్పుకుంటాను. మరి మీ నాన్నతో నేను చదువుకుంటాను. నాకు పెళ్ళొద్దని ఎందుకు పోట్లాడలేకపోయావు? పెళ్ళి చేసుకున్నావు కాబట్టి నీమీద కొన్ని బాధ్యతలు పడ్డాయి. ఇంత చిన్న వయసులో నాకు పెళ్ళొద్దని ఎందుకు పట్టుబట్టలేదు? ఇప్పటికైనా నీకు పట్టుదల ఉంటే ఇన్ని పనులు చేస్తూ కూడా చదువుకోవచ్చు."

"అవును. నాకే పట్టుదల లేదు. నాకే చదువుకోవాలని లేదు. మీ కొడుకులకు మాత్రమే చదువుకోవాలన్న పట్టుదల ఉంది. చదువుకునే తెలివితేటలున్నాయి. నాకా పట్టుదలా లేదు, తెలివితేటలూ లేవు. ఏదో గాలికి పెరిగినదాన్ని. ఇంట్లో పడుండి అంట్లు తోముతూ, వంట చేస్తూ మీకందరికీ సేవలు చెయ్యాల్సినదాన్ని. నాకింతకంటే ఇంకేం స్థానం ఉంటుందీ ఇంట్లో..."

"మై గాడ్! ఏడుస్తున్నావా? ఇప్పుడు నిన్ను నేను ఏమన్నానని ఇలా ఏడుస్తున్నావు? ఆఫీసు నుండి త్వరగా వచ్చి ఇద్దరం కలిసి సినిమాకెళదామని అనడమేనా నేను చేసిన తప్పు."

"మీ తప్పేం లేదు. అంతా నా తప్పే."

"అంతా నీ తప్పేనని ఎవరన్నారిప్పుడు?"

"మీరు ఆఫీసు నుండి త్వరగా వచ్చి సినిమాకు వెళదాం రమ్మంటే నేనే రాలేదు. కాబట్టి తప్పు నాదేగా. మీ కోరికను తీర్చలేకపోయాను. క్షమించండి."

"సారీలు, క్షమాపణలు అక్కర్లేదు. ఆ ఏడుపు మానేసి ఇప్పటికైనా త్వరగా తయారై సినిమాకొస్తే చాలా సంతోషిస్తాను."

"ఏడుపుగొట్టుదాన్ని. ఏడవకుండా ఎలా ఉంటాను. నాకు మిగిలిందింక ఏడుపే."

"అబ్బబ్బబ్బ! ఏమిటీ నస? ప్రతి మాటకు ఇలా తప్పుపడితే బతకడం చాలా కష్టం. నాకు మిగిలిందింక ఏడుపేనంటున్నావు. నీకంత కష్టం ఏమొచ్చిందిప్పుడు?"

"మెల్లగా మాట్లాడండి. పక్కవాళ్ళు వింటారు."

"వింటే విననీ. భయమేమిటి? మాటమాటకు పక్కవాళ్ళు వింటారు, పక్కవాళ్ళు వింటారు అని భయపెడతావెందుకు? అంత అనరాని మాటలు ఇప్పుడు నేనేమంటున్నానని."

"అలా అరచినట్టుగా మాట్లాడొద్దని మీకెన్నిసార్లు చెప్పాను. మనమేం మాట్లాడుకున్నా పక్క పోర్షన్ వాళ్ళకు వినిపిస్తుంది. భర్త ఆఫీసు నుండి రాగానే భార్య అతన్ని సాధిస్తున్నదని వాళ్ళు అనుకోవాలనా మీ ఉద్దేశం?"


"సాధిస్తే తప్పులేదు గానీ అంటేనే తప్పొచ్చిందా? పక్కవాళ్ళు వింటేనే తప్పొచ్చిందా?"

"అంటే నేను మిమ్మల్ని సాధిస్తున్నాననేనా మీ ఉద్దేశం?"

"ఇదంతా సాధించడం కాకపోతే మరేమిటి? అసలు నీకొచ్చిన కష్టమేమిటి? నేను నిన్నేమన్నానని ఇలా సాధిస్తున్నావు? ఆ ఏడుపేమిటి? ఈమాత్రం ఇంటిపని ఎవరూ చేసుకోవడం లేదా? నువ్వొక్కదానివే చేస్తున్నావా? బయటకు వెళ్ళి నేను పని చెయ్యడంలేదా? ఎవరి పనులు వాళ్ళు చేస్తున్నారు. ఎవరి బాధ్యతలు వాళ్ళు నిర్వహిస్తున్నారు. ఇందులో ఇంత బాధపడవలసింది, ఇంత గింజుకోవలసింది, ఇంత ఏడవవలసింది, ఇంత తల బాదుకోవలసిందీ ఏముందో నాకర్థం కావడం లేదు."

"మీ కాళ్ళు పట్టుకుంటాను. ఆవేశం తగ్గించుకొని కాస్త మెల్లగా మాట్లాడండి. మీరంత గట్టిగా మాట్లాడితే నాకు భయమేస్తుంది."

"నువ్వు నా కాళ్ళు పట్టుకోవలసిన అవసరం లేదు. అసలు నీ బాధేమిటో చెప్పు. నేను నీకు చేస్తున్న ద్రోహమేమిటో చెప్పు. నాకు మిగిలిందిక ఏడుపే అన్నంత దయనీయ స్థితికి నువ్వెందుకొచ్చావో చెప్పు. ప్లీజ్ చెప్పు. నేనేమన్నా తాగొచ్చి నిన్ను వేధిస్తున్నానా? నిన్ను నలుగురి ఎదుట అనరాని మాటలని అవమానిస్తున్నానా? హింసిస్తున్నానా? నాకు నువ్వుగాక వేరే ఇంకే స్త్రీతోనన్నా సంబంధం ఉందా? లేక మీ నాన్న నాకు సరిపోయేంత కట్నం ఇవ్వలేదని, ఇంకా తీసుకురమ్మని వేధిస్తున్నానా? చెప్పు. నీ బాధకు, నీ దుఃఖానికి కారణమేమిటో చెప్పు. నేను నీకు చేసిన ద్రోహమేమిటో చెప్పు."



"మీరూ, నేనూ ఎప్పుడూ కలిసుండాలనీ, మీరు పూర్తిగా నా సొంతం కావాలనీ, మనకై మనం నిర్మించుకున్న ప్రపంచంలో మనిద్దరమే ఉండాలనీ... ఇలా ఏమేమో ఊహించుకున్నాన్లెండి."

ఏమీలేదు. మీరు నాకేమీ ద్రోహం చెయ్యలేదు. మీరు నన్ను ప్రేమగానే చూసుకొన్నారు."

"అలాంటప్పుడు నువ్వెందుకింత బాధపడుతున్నావు? నన్నెందుకిలా సాధిస్తున్నావు?"

"దయచేసి సాధిస్తున్నానని పదేపదే అనకండి. పక్కవాళ్ళు వింటారు."

"విననీ. నాకేం భయం లేదు."

"కానీ, నాకుంది."

"ఎందుకు?"

"వాళ్ళు మనం అనుకునే ఈ మాటలన్నీ మీవాళ్ళొచ్చినప్పుడు వాళ్ళకు చెబుతారు. మీవాళ్ళకు నామీదున్న అసహ్యం ఇంకా పెరుగుతుంది."

"మావాళ్ళకు నీమీద అసహ్యం ఉందని ఏ ఆధారంతో అంటున్నావు?"

"చదువుకోవడానికని పిల్లల్ని నా కొడుకు దగ్గరుంచితే మా కోడలు వాళ్ళను సరిగ్గా చూడడం లేదనీ మీ అమ్మగారు, మీ అక్కలు ఎన్నిసార్లనుకున్నారో, ఎవరెవరితో అన్నారో నాకు తెలియదనుకుంటున్నారా?"

"ఎవరెవరితో అన్నారట. చెప్పు. నేను వెళ్ళి వాళ్ళను అడుగుతాను."

"మీరేమీ అడగొద్దు. అలా అడిగారంటే మీరు నన్ను చంపుకున్నంత ఒట్టే."

"ఇదేమిటి, నువ్విప్పుడు మా అమ్మ మీద, అక్కలమీద ఒక అభియోగం మోపావు. అది నిజమో కాదో తెలుసుకోవద్దా."

"తెలుసుకోవాల్సిన అవసరం లేదు. కేవలం మీకర్థం కావడం కోసమే చెప్పాను తప్ప మీరు వెళ్ళి వాళ్ళను అడగాలనీ, వాళ్ళనేమో అనాలనీ చెప్పలేదు. దయచేసి నన్నర్థం చేసుకోండి."

"నిన్నర్థం చేసుకోక ఏం చేశాను?"

"రోజూ ఎంతపని చేస్తున్నానో. అయినా, ఎన్ని మాటలు పడుతున్నానో, నాకష్టమంతా ఎలా వృథా అయిపోతున్నదో మీరర్థం చేసుకుంటే చాలు."

"నీ కష్టం వృథా అయిపోవడమేమిటి. నువ్వెంత కష్టపడుతున్నావో నేను చూడడం లేదా. వాళ్ళను మన దగ్గరుంచుకొని చదివించడం నా బాధ్యత అయినప్పుడు అది నీ బాధ్యత కూడా అవుతుందనుకున్నాను. నీ బాధ్యతను నువ్వు నిర్వహిస్తున్నావనే అనుకుంటున్నాను."

"మీరనుకుంటేనే సరిపోతుందా. అనుకోవలసిన వాళ్ళు అనుకోవాలిగా."

"అనుకోవలసిన వాళ్ళు అనుకోవడం లేదని అనుకోకు. వాళ్ళు కూడా అనుకుంటున్నారు. వాళ్ళు నువ్వనుకున్నంత చెడ్డవాళ్ళేమీ కారు."

"నేనే చెడ్డదాన్ని"

"నువ్వు చెడ్డదానివని ఎవరన్నారిప్పుడు?"

"ఎవరూ అనలేదు. నాకు నేనే అనుకుంటున్నాను. నేను చెడ్డదాన్నే."

"మళ్ళీ ఏడుపా! నిన్ను చెడ్డదానివని ఎవరూ అనకుండానే నువ్వే ఎవరో అన్నారని ఊహించుకొని బాధపడితే నేనేం చెయ్యాలి."

"నా బతుకంతా ఊహించుకోవడంతోటే గడిచిపోతున్నది లెండి. ఎన్నో ఊహించుకున్నాను. ఆ ఊహలన్నీ నిజమవుతాయనుకున్నాను. కానీ, ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది - అవి ఊహాగానాలుగానే మిగిలిపోతాయని!"

"ఊహలుగానే మిగిలిపోయే ఆ ఊహలేమిటో చెప్పు. సాధ్యమైనంత వరకు వాటిని నిజం చేసే ప్రయత్నం చేస్తాను."

"చెప్పడానికేమీ లేదు."

"చెప్పు... ప్లీజ్ చెప్పు... ప్లీజ్."

"మీరూ, నేనూ ఎప్పుడూ కలిసుండాలనీ, మీరు పూర్తిగా నా సొంతం కావాలనీ, మనకై మనం నిర్మించుకున్న ప్రపంచంలో మనిద్దరమే ఉండాలనీ... ఇలా ఏమేమో ఊహించుకున్నాన్లెండి."

"ఊహించుకుంటే ఏమైందిప్పుడు. మనం ఎప్పుడూ కలిసే ఉంటున్నాం కదా! నాకు నువ్వే సర్వస్వమని, నువ్వు తప్ప నాకు వేరే లోకమే లేదని నీకెన్నిసార్లు చెప్పాను. నేను నా హృదయంలో నీకిచ్చిన స్థానాన్ని మరెవరూ ఆక్రమించలేరు. అలాంటప్పుడు నీకింత బాధెందుకు."

"బాధేమీ లేదు. చాలా హాయిగానే ఉన్నాను."

"ఎందుకా వెటకారం. పోనీయ్, హాయిగా లేవు. నీ కొచ్చిన కష్టమేమిటో చెప్పు."

"అంతా సుఖమే. కష్టమెక్కడిది. కష్టముందని ఊహించుకుంటున్నాను. అంతా ఊహించుకోవడంలోనే ఉంటుంది కదా!"

"నేనన్న ఆ మాటను ఇంకెన్నిసార్లు రిపీట్ చేస్తావు. ఆ మాటన్నందుకు సారీ. మా అన్న పిల్లల్ని తీసుకొచ్చి ఇక్కడ మనింట్లో ఉంచుకొని చదివించడమే నీ బాధకు కారణమా? రేపే వాళ్ళను బయటకు పంపిస్తాను. ఏ హాస్టల్లోనన్నా ఉంచుతాను."

"భర్త చదివిస్తానని తీసికెళ్తే గయ్యాళి భార్య వాళ్ళను ఇంట్లోంచి గెంటేసిందట' అని లోకం నన్ను ఆడిపోసుకోవడానికా! అలా అయితే నేను హాయిగా ఉంటాననుకుంటున్నారా? మీకేమో చాలా మంచివారన్న పేరు రావాలి. నాకేమో గయ్యాళిది అన్న పేరు రావాలి. ఏమొద్దు బాబూ. ఏమొద్దు. మీరేమీ వాళ్ళను బయటకు పంపించొద్దు. నన్నిలా బతకనీయండి చాలు."

"ఇదేం బతకడం? అనుక్షణం ఏడుస్తూ, ఒకర్నొకరం

హింసించుకుంటూ నిరాశతో, నిస్పృహతో, నిష్ఠురాలతో అనుక్షణం చస్తూ బతకడం కంటే ఒక్కసారే చావడం నయం."

"మీరెందుకు చావడం. చస్తే నేనే చస్తాను. నేనొక్కదాన్ని చస్తే అందరి కళ్ళూ చల్లబడతాయి."

"ఎందరి కళ్ళు చల్లబడతాయి."

"నాకు తెలీదు."

"నా కళ్ళు కూడానా?"

"తెలీదు."

"తెలీదా? నువ్వే నా సర్వస్వమనుకున్నాను. అలాంటి నా కళ్ళు కూడా నువ్వు చస్తే చల్లబడతాయా?"

"మీ కళ్ళు చల్లబడతాయని నేనన్లేదు. లోకం కళ్ళు చల్లబడతాయన్నాను."

"లోకమంటే ఎవరు?"

"తెలీదు."

"నీ దృష్టిలో లోకమంటే మా అమ్మ, మా నాన్న, మా అన్న, మా అక్కలు. అంతేనా?"

"తెలీదు."

"అసలు నీ బాధంతా నేను ప్రేమించడం లేదని కాదు. వేరే వాళ్ళను ద్వేషించడం లేదని. ముఖ్యంగా మా అమ్మను, నాన్నను, అన్నను, అక్కల్ని ద్వేషించడం లేదని నీ బాధ. అంతేనా?"

"దయచేసి అలా అరవకండి. మీ కాళ్ళు పట్టుకుంటాను."

"నా కాళ్ళు నువ్వేం పట్టుకోవద్దు. నీకేం కావాలో స్పష్టంగా చెప్పు. చాలు. నీకో విషయం చెబుతున్నాను విను. మా అన్నయ్య నాలాగా చదువుకోలేదు. ఇంటిపట్టునే ఉంటూ మా నాన్నకు వ్యవసాయంలో సహాయపడుతున్నాడు. ఆయన తోడుగా ఉండడం వల్లనే మా నాన్న వ్యవసాయం చెయ్యగలుగుతున్నాడు. మా అన్న రాత్రింబవళ్ళు పొలాల్ని పట్టుకొని ఉండడం వల్లనే మా నాన్న కొంచెం సంపాదించగలిగాడు. నన్ను టౌనులో ఉంచి చదివించగలిగాడు. మా అన్న కారణంగానే నేను చదువుకొని ఇవ్వాళ ఈ ఉద్యోగం చెయ్యగలుగుతున్నాను. మా అన్నకు, తాను చదువుకోలేదు కాబట్టి తన కొడుకులైనా బాగా చదువుకొని ఉద్యోగం చెయ్యాలని ఉంది. అందుకనే వాళ్ళను చదివించే బాధ్యతను నేను నా నెత్తిమీద వేసుకున్నాను. కొన్ని బాధ్యతలు నిర్వహించడం కోసం మనం కొన్ని త్యాగాలు చెయ్యక తప్పదు."

"త్యాగాలు చేసేటంత గొప్పదాన్ని కాను నేను. నేను చాలా చిన్నదాన్ని. పెద్దగా చదువుకోలేదు. నా ప్రపంచం చాలా చిన్నది. నా ప్రపంచంలో మీరు తప్ప ఇంకెవరూ లేరు. ఇంత చిన్న ఇంట్లో మనతో పాటు మరో ఇద్దరుండేటప్పటికి మీతో కాస్సేపయినా ఒంటరిగా గడిపే అవకాశం లభించడం లేదన్నదే నా బాధ. కానీ, నా బాధ మీకర్థం కాదు. మీ బాధ్యతలు నాకర్థం కావు."

"ఇంత చిన్న విషయం నీకర్థం కాకపోవడమేమిటి?"

"నేను చాలా చిన్నదాన్నండి. నేనసలు మీకు తగిన భార్యనే కాను. మీరు నన్ను గాక ఇంకెవర్ని చేసుకున్నా సుఖపడేవాళ్ళే."

"ప్లీజ్... ప్లీజ్... అలా మాట్లాడకు. నువ్వలా మాట్లాడితే నాకు పిచ్చెక్కుతుంది."

"మీకు పిచ్చెక్కించేటంత చెత్తగా నేను మాట్లాడుతున్నానని మీ ఉద్దేశం. అందుకే చెబుతున్నానండి. మీరు నన్ను వదిలేసి ఇంకెవరినైనా చేసుకోండి."

"అనూరాధా! ప్లీజ్..."

"నేనేమన్నానని అలా తల బాదుకుంటున్నారు?"

"..."

"..."

"..."

"..." ■

# దూరవిద్యపై దృష్టి

## సార్వత్రిక విశ్వవిద్యాలయాల జయాపజయాలపై విహంగ వీక్షణం



దూర విద్య- ప్రాంతీయ భాషల అభివృద్ధి
రచన: కె.యెస్. రమణ
ప్రతులకు: మంజులా పబ్లికేషన్స్, 6-3-609/1/ఎ, ఖైరతాబాద్, హైదరాబాద్- 4.
పేజీలు: 142.
వెల: రూ. 95/-

**రెంటాల జయదేవ**

దేశంలో ఈ రోజున మునుపెన్నడూ లేనంతగా ఉన్నత విద్యావసరాలు పెరిగాయి. ఆ మేరకు కాకపోయినా ఎంతో కొంత అవకాశాలూ పెరిగాయి. సాంప్రదాయిక విద్యావిధానంలో చదువుకోలేనివారికీ, చదువుకోలేక పోయినవారికీ ఇప్పుడు అనియత విద్య ఓ వరంలా పరిణమించింది. దీన్నే దూరవిద్యనీ అంటున్నాం. ఓపెన్ యూనివర్సిటీలు అందిస్తున్న ఈ మహత్తర అవకాశం అక్షరాస్యతను పెంచడమే కాక, సమాజ స్థితిగతులను కూడా ప్రభావితం చేస్తోంది. 1969లో ప్రపంచంలోనే తొలిసారిగా ఇంగ్లండ్‌లో ఏర్పాటైన సార్వత్రిక విశ్వవిద్యాలయం మొదలుకొని, ఇటీవలే 1998లో కలకత్తాలో నెలకొన్న సుభాష్ చంద్ర బోస్ ఓపెన్ యూనివర్సిటీ వరకు గతాన్ని ఒక్కసారి పరిశీలిస్తే, సార్వత్రిక విద్యావిధానం ఎంత బలంగా వేళ్ళూనుకుంటూ వస్తోందో మనకు అర్థమవుతుంది. అలాంటి దూరవిద్యకి ఇప్పుడున్న ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తూ, ప్రాంతీయ భాషల అభివృద్ధిలో వాటి పాత్రను ప్రస్తావిస్తూ రాసిన వ్యాసాల సంపుటి ఈ *దూరవిద్య - ప్రాంతీయ భాషల అభివృద్ధి* పుస్తకం.

> సంప్రదాయ విద్యా వ్యవస్థలోని పాఠ్య ప్రణాళికలు సమాజ అవసరాలకూ, మార్పులకూ సంబంధం లేకుండా ఉంటున్నాయి.

మన దేశంలోని మొట్టమొదటి ఓపెన్ యూనివర్సిటీ ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (1982లో ఏర్పాటైన దీన్నే ఇప్పుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అని పిలుస్తున్నాం). మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు స్త్రీలు, సామాజికంగా వెనుకబడిన వాళ్ళతో సహా ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత దీనిది. ఆరంభం నుంచి ఆ యూనివర్సిటీతో అనుబంధం; అక్కడి పాఠ్యాంశాల రూపకల్పన, నిర్వహణ, పరిష్కరణల్లో భాగస్వామ్యం ఉన్న వ్యక్తి డాక్టర్ కె.యెస్. రమణ. ప్రస్తుతం ఆ విశ్వవిద్యాలయంలోనే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న కవి, కథకుడు, అనువాదకుడు ఆయన. ఈ పుస్తకంలో ఆయన అందించిన వ్యాసాలు ఎన్నో విషయాలు, విశేషాలను తెలియజేస్తాయి. *వర్తమాన దేశాలకు విజ్ఞానదీపం సార్వత్రిక విద్యావిధానం, భాషాబోధనలో వినూత్న ప్రయోగం, సాహిత్య బోధన- ఆధునిక పాఠ్యప్రణాళిక, ప్రాంతీయ భాషలో వృత్తివిద్యాకోర్సులు* మొదలైన తొమ్మిది వ్యాసాలు ఈ సంపుటిలో ఉన్నాయి. ఈ వ్యాసాలతో పాటు ఎంతో విలువైన గణాంక వివరాల పట్టికలు కూడా ఇచ్చారు.

ప్రధానంగా పాఠ్యపుస్తకాల తరహాలో గంభీరంగా సాగిన ఈ వ్యాసాలలో రచయిత కొన్ని ఆదర్శాలు, అభిప్రాయాలు కూడా వెల్లడించారు. దూరవిద్యా విధానంలో మాతృభాషలో విభిన్నమైన సాంకేతిక కోర్సులను ప్రారంభించాలనీ, మహిళల సంక్షేమం, ఆరోగ్యం, ఆర్థిక, రాజకీయ, స్వయం నిర్ణయాది కారతను పెంపొందిచేందుకు తోడ్పడే కోర్సులను ప్రాంతీయ భాషలో అందించాలనీ హితవు చెప్పారు. "సార్వత్రిక విద్యావ్యవస్థ ద్వారా విద్యనభ్యసించే మహిళలలో గృహిణులదే అగ్రస్థానం" అని రచయిత తెలిపారు. అలాగే, వృత్తి, సాంకేతికపరమైన అనేక కోర్సులలో కన్నా "ఎక్కువగా బి.ఎ, బి.కాం., ఎం.ఎ లాంటి కోర్సుల్లో గృహిణులు చేరుతున్నా"రని వివరించారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అందిస్తున్న అనియత విద్యావిధానంలో కూడా మధ్యలో చదువు మానేస్తున్న విద్యార్థుల సంఖ్య సుమారు 70 నుంచి 80 శాతం మధ్య ఉందనే చేదునిజాన్ని వెల్లడించారు. అదే సమయంలో సాహిత్య బోధనలో అంబేద్కర్ విశ్వవిద్యాలయం అనుసరించిన ఆధునిక వ్యూహాన్నీ, శైలీపత్రం రూపొందించుకొన్న తీరుతెన్నులనూ చెప్పారు.

ఈ పుస్తకానికి శీర్షికగా నిర్ణయించిన *దూరవిద్య- ప్రాంతీయ భాషల అభివృద్ధి* అనే వ్యాసంలో రచయిత తెలుగు మాధ్యమం అమలులోని సాధక బాధకాలు వివరించారు. ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన దాదాపు దశాబ్ది తర్వాత 1966లో రాష్ట్ర ప్రభుత్వం తెలుగును అధికార భాషగా చేసింది. అప్పటికే నాలుగైదు దశాబ్దాలుగా ప్రాథమిక విద్యారంగంలో తెలుగు బోధనా మాధ్యమంగా అమల్లో ఉంది. 1968 నుంచి ఇంటర్, డిగ్రీ స్థాయిలో కూడా తెలుగు బోధనా భాషైంది. "తెలుగు మాధ్యమంలో డిగ్రీలు చేసినవారికి ప్రభుత్వోద్యోగాలలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే, ప్రైవేట్ సంస్థలు, బ్యాంకులు వీటికి స్పందించలేదు" అంటూ కె.యెస్. రమణ తెలుగు మాధ్యమం పట్ల ఇప్పుడు ఏర్పడిన నిరాసక్తతకు ఓ కారణాన్ని చెప్పకనే చెప్పారు. తెలుగు మాధ్యమంలో ఉన్నత విద్యా బోధనకు అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం చేసిన కృషి తెల్పారు.

"అధికార భాషాసంఘం స్పష్టమైన లక్ష్యాలతో, వ్యూహంతో, చిత్తశుద్ధితో తెలుగును భిన్నస్థాయుల్లో అమలుచేసే కార్యక్రమాలను చేపట్టాలి. తెలుగు భాషకు సంబంధించిన కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధిచేసి, విద్యాసంస్థలకు అందుబాటులోకి తేవాలి. తెలుగులో పారిభాషిక పదాల ప్రామాణికతకు కమిటీలు వేసి, పారిభాషిక పదకోశాలను తయారుచేయాలి..." అంటూ తెలుగు భాషాభివృద్ధికి సూచనలు చేశారు. విషయ ప్రధానమైన ఈ వ్యాససంపుటి చదివింపజేస్తుందా, లేదా అన్నది అటుంచితే, చదివి తెలుసుకోవాల్సినవి ఎన్నో ఉన్నాయన్నది మాత్రం వాస్తవం. ■